

క్రీస్తు ప్రాణ త్యాగం పాపుల కోసమే!

కరుణామయుడైన ఏసుక్రీస్తు శిలువపై తన ప్రాణాలను బలిపెట్టిన రోజే గుడ్‌ఫ్రై డే. దీన్నే శుభశుక్రవారం అని కూడా అంటారు. -8లో..



దేశ భవిష్యత్తులో యువత పాత్ర కీలకం

దేశ భవిష్యత్తులో యువత పాత్ర కీలకమని ఒరిస్సా రాష్ట్ర అనిమల్ రిసోర్సు డెవలప్‌మెంట్ డైరెక్టర్ వై.విజయ్ అన్నారు. -8లో..



బావిలో గల్లంతైన యువకుడి మృతి

లక్కిరెడ్డిపల్లె మండలంలో బావి నీటిలో బుధవారం గల్లంతైన యువకుడి మృతదేహాన్ని గురువారం బయటకు తీశారు. -8లో..



న్యూస్‌రీల్

దివ్యాంగుల సంక్షేమానికి కృషి



దివ్యాంగులకు వాహనాలను అందిస్తున్న రవాణా శాఖ అధికారులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: దివ్యాంగుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా ఉప రవాణాశాఖ కమిషనర్ ఇ. మీరా ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం కడపలోని జిల్లా ఉప రవాణా శాఖ కమిషనర్ కార్యాలయంలో నవ రత్నాల్లో భాగంగా జగనన్న చేదోడు పథకం కింద 73 మంది దివ్యాంగులకు మూడు చక్రాల బైక్‌లను అందించి వాటిని అక్కడిక్కడే రిజిస్ట్రేషన్ చేశారు. జిల్లాలోని 36 మండలాలకు చెందిన అర్హులైన దివ్యాంగులకు ఉచితంగా వీటిని అందించినట్లు చెప్పారు.పైలట్ ప్రాజెక్టు కింద వైఎఎస్సార్ జిల్లాకు అధికంగా 73 మూడు చక్రాల బైక్‌లను ప్రభుత్వం ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో ఎంవీఐలు విజయ్ భాస్కర్, శివ ప్రసాద్, ప్రసాద్, ఏఎంవీఐ లక్ష్మీ ప్రసన్న సిబ్బంది పాల్గొన్నారు.

సెలవుపై వెళ్లిన డీటీసీ

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: జిల్లా ఉప రవాణా శాఖ కమిషనర్(డీటీసీ) ఇ. మీరా ప్రసాద్ వ్యక్తి గత పనులపై శుక్రవారం నుంచి పది రోజుల పాటు సెలవుపై వెళుతున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇన్‌చార్జి కమిషనర్‌గా ప్రొద్దుటూరు ఆర్టీవో సుశీల నియమితులయ్యారు.

146 మంది గైర్హాజరు



పరీక్షకు హాజరైన విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా గురువారం నిర్వహించిన పదో తరగతి హిందీ పరీక్షకు 146 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లాలోని 146 పరీక్షా కేంద్రాల్లో 27,228 మంది విద్యార్థులకు 27,142 మంది హాజరయ్యారు. ఇందులో భాగంగా ఫ్లయింగ్ స్క్వాడ్ జిల్లాలోని 55 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేయగా డీఈఓ రాఘవరెడ్డి 10, పది పరీక్షల అబ్జర్వర్ వెంకట కృష్ణారెడ్డి రెండింటిని తనిఖీ చేశారు. జిల్లాలో మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని డీఈఓ తెలిపారు.

ఏఎంసీ వైద్య సిబ్బందికి కరోనా

మదనపల్లె : అన్నమయ్య జిల్లా మదనపల్లెలోని ఆరోగ్యవరం మెడికల్ సెంటర్(ఏఎంసీ)లోని కొంతమంది వైద్యసిబ్బందికి కరోనా పాజిటివ్ రాగా, తక్షణ వైద్యసేవలతో కోలుకుంటున్నారని డాక్టర్ రిచర్డ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. గత వారం ఏఎంసీలో కొత్త ప్రాజెక్ట్ ప్రారంభంలో భాగంగా వైద్యసిబ్బందికి స్క్రీనింగ్ టెస్ట్‌లు నిర్వహించారు. వాటిలో ఏడుగురు వైద్యులు జలుబు, దగ్గుతో బాధపడుతుండగా.. రాపిడ్ టెస్ట్ నిర్వహించి కరోనా పాజిటివ్‌గా గుర్తించారు. దీంతో వారికి తక్షణం వైద్యచికిత్సలు అందించడంతో అందరూ కోలుకున్నారు. కరోనా వ్యాప్తిపై అవగాహన లేక పోవడంతో పలువురు పలురకాలుగా వదంతులు వ్యాప్తి చేస్తున్నారని, ఇందులో భయపడాల్సిన అవసరం లేదని డాక్టర్ స్పష్టం చేశారు.

సూక్ష్మం.. దాటిన లక్ష్యం

- జిల్లాలో అధికంగా డ్రిప్పు, స్ప్రింక్లర్ల ఏర్పాటు
- ఆనందోత్సాహంలో అన్నదాతలు





పెండ్లిమర్రి మండలం నందిమండలంలో డ్రిప్పు పైపుల ఏర్పాటుకు తీసిన కాలువలను పరిశీలిస్తున్న అధికారులు

కడప అగ్రికల్చర్: తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగుచేసుకునేలా ప్రభుత్వం రైతులకు బిందు(డ్రిప్), తుంపర(స్ప్రింక్లర్) పరికరాలను ఇచ్చి సూక్ష్మ సేద్యాన్ని ప్రోత్సహిస్తోంది. అర్హులైన రైతులకు రాయితీపై పరికరాలను అందిస్తోంది. వీటి ద్వారా నీటి వృథాను అరికట్టడంతోపాటు విద్యుత్తు పొదుపు చేయవచ్చు. అలాగే మొక్కకు సరిపడా నీరు అందించవచ్చు. కూలీల ఖర్చు తగ్గించుకోవచ్చు. రైతులకు ఈ విధానం లాభదాయకంగా నిలుస్తోంది.

టార్గెట్‌కు మంచి ...

డ్రిప్పు, స్ప్రింక్లర్ల ఏర్పాటుకు సంబంధించి జిల్లాలో 2022–23 సంవత్సరానికి 8000 హెక్టార్లలో ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు(ఏపీఎంఐపీ) లక్ష్యంగా పెట్టుకుంది. జిల్లాలో గడువు ముగిసే నాటికి 9982 హెక్టార్లకు వీటిని మంజూరు చేసింది. అంటే ఇచ్చిన టార్గెట్‌కంటే అధికంగా 1982 హెక్టార్లకు మంజూరు చేసింది. ఇప్పటి వరకు 5530 హెక్టార్లకు డ్రిప్పు, స్ప్రింక్లర్ల పరికరాలను రైతులకు అందించారు.ఇందులో 1060 హెక్టార్లకు స్ప్రింక్లర్లు, 4470 హెక్టార్లకు డ్రిప్పు పరికరాలను అందించారు. మిగతా 4452 హెక్టార్లకు అందించాల్సి ఉంది.

రైతులకు రాయితీ ఇలా...

బిందు, తుంపర సేద్య పరికరాలకు దరఖాస్తు చేసుకునే రైతులకు భూ విస్తీర్ణం మేరకు రాయితీ లభించనుంది. ఇందులో ఐదు ఎకరాల లోపు భూమి కలిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మైనార్టీ రైతులకు 90 శాతం, 5 నుంచి 10 ఎకరాల లోపు ఉన్న రైతులకు 70 శాతం రాయితీపై పరికరాలను ప్రభుత్వం అందిస్తుంది. అలాగే గతంలో డ్రిప్పు ఏర్పాటు చేసుకుని ఏడు సంవత్సరాలు ముగిసిన రైతులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. డ్రిప్ పరికరాలను పంపిణీ చేసే 27 కంపెనీల్లో రైతులు దేన్నయినా ఎంపిక చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించింది.

డ్రిప్పు, స్ప్రింకర్ల ఏర్పాటుకు ఇచ్చిన లక్ష్యం :	8000 హెక్టార్లు
మార్చి చివరి నాటికి పూర్తి చేసింది:	9982 హెక్టార్లు
ఇప్పటి వరకు మెటీరియల్ అందించింది :	5530 హెక్టార్లు
అందించాల్సినది :	4452 హెక్టార్లు

క్షేత్రస్థాయిలో పరిశీలన.....

డ్రిప్పు, స్ప్రింక్లర్ల కోసం దరఖాస్తు చేసుకున్న రైతులకు సంబంధించి క్షేత్రస్థాయిలో ముమ్మరంగా పరిశీలన జరుగుతోంది. దరఖాస్తు చేసుకున్న వారికి ఎంత భూమి ఉంది, వాటికి బోరు సౌకర్యం ఉందా. అందులో ఎంత నీరు వస్తుంది. రైతు పొలంలో ఏ పంటలు సాగులో ఉన్నాయి, పైపుల ఏర్పాటుకు ఎంత ఖర్చు వస్తుంది. ఇందులో రైతుకు ఎంత సబ్సిడీ వర్తిస్తుందనే విషయాలను రైతుభరోసా కేంద్ర వ్యవసాయ, ఉద్యానశాఖ అసిస్టెంట్, కంపెనీ ప్రతినిధులు వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలను నమోదు చేసుకుంటున్నారు.

లక్ష్యం పూర్తి చేశాం



డ్రిప్పు, స్ప్రింక్లర్ల ఏర్పాటుకు సంబంధించి మార్చి చివరి వరకు గడువు ఉండగా లక్ష్యాన్ని పూర్తి చేశాం. జిల్లావ్యాప్తంగా 8000 హెక్టార్లకు వీటిని మంజూరు చేయాల్సి ఉండగా 9982 హెక్టార్లకు మంజూరు చేశాం.ఇప్పటి వరకు 5530 హెక్టార్లకు పరికరాలను అందించాం. మిగతా 4452 హెక్టార్లకు డ్రిప్పు, స్ప్రింక్లర్లను మంజూరు చేశారు. త్వరలో వాటిని కూడా అందిస్తాం. –మూలి. రవీంద్రనాథ్‌రెడ్డి, జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి

ప్రజల చెంతకే వైద్య సేవలు

కలెక్టర్ విజయరామరాజు, ఎమ్మెల్యే రఘురామిరెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు, చిత్రంలో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, తిరుపాల్‌రెడ్డి

దువ్వూరు : ప్రజల చెంతకే వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫ్యామిలీ డాక్టర్ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు కలెక్టర్ విజయరామరాజు తెలిపారు. మండల పరిధిలోని అన్నపుశాస్త్రులపల్లె గ్రామంలో గురువారం నూతనంగా నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్, ఆర్‌బీకేలను కలెక్టర్ విజయరామరాజు, ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ప్రారంభించారు. అలాగే 104 వాహనం, ఫ్యామిలీ డాక్టర్ పథకాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేసి గ్రామాల్లో హెల్త్ క్లినిక్‌లను ప్రారంభించిందని తెలిపారు. నవరత్నాల పథకాలలో ఫ్యామిలీ డాక్టర్ పథకం విశిష్టమైనదని చెప్పారు. 104 వాహనంలో ఒక డాక్టర్ అందుబాటులో ఉంటారని, వీరంతా ప్రజల చెంతకే వచ్చి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందిస్తారన్నారు. ఆర్‌బీకేల ద్వారా రైతులు సాగు చేసిన పంటలను ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని సూచించారు.

ప్రజల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత

ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. మండల కేంద్రమైన దువ్వూరులో ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉందని, మరో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని చింతకుంటకు మంజూరు చేశారని చెప్పారు. ఆస్పత్రి నిర్మాణం త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. 104 వాహనంలో ఉన్న వైద్య సిబ్బంది 14 రకాల వ్యాధులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందిస్తారని తెలిపారు. ఆర్‌బీకేల ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలను, ఎరువులను సకాలంలో రైతులకు ప్రభుత్వం అందిస్తోందన్నారు. టీడీపీ హయాంలో ప్రజలకు ఎలాంటి వైద్య సేవలు అందించలేదని ఎద్దేవా చేశారు. ప్రజలకు మంచి సంక్షేమ పాలన అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆదరించి, ఆశీర్వదించి 2024 ఎన్నికల్లో గెలిపించాలని ప్రజలను కోరారు.కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారుడు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, జెడ్పీటీసీ మేరువ కృష్ణయ్య, సర్పంచ్ పుత్తా శ్రీనివాసులరెడ్డి, డీఎంహెచ్‌ఓ నాగరాజు, జిల్లా వ్యయసాయశాఖ ఏడీ నాగేశ్వరరావు, ఎంపీడీఓ జగదీశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జేసీల బదిలీ



జి.గణేష్‌కుమార్



హిమాన్షు కౌశిక్

అన్నమయ్య జిల్లా జేసీగా హిమాన్షు కౌశిక్

కడప సిటీ : వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల జేసీలు బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు గురువారం జారీ చేసింది. కడపలో జేసీగా పనిచేస్తున్న సీఎం సాయికాంత్ వర్మను జీవీఎంసీ(వైజాగ్) కమిషనర్‌గా నియమిస్తూ, ఆయన స్థానంలో సీసీఎల్ఎ లో జాయింట్ సెక్రటరీగా ఉన్న జి.గణేష్‌కుమార్‌ను నియమించారు. 2016 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన గణేష్ కుమార్‌ది కర్నూలు సొంత జిల్లా కాగా, ఆయన రాయచోటిలో బీటెక్ చదివారు. అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ గా 2018 బ్యాచ్‌కు చెందిన హిమాన్షు కౌశిక్ నియమితులయ్యారు. ఈయన ప్రస్తుతం ఢిల్లీలోని ఏపీ భవన్‌లో అడిషనల్ రెసిడెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్నారు. జేసీగా ఉన్న తమీమ్ అన్సారియాను తదుపరి పోస్టింగ్ కొరకు రిపోర్టు చేసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు.

వైభవం.. గంధోత్సవం..



చాందినీ వాహనంలో గంధం తీసుకొస్తున్న భక్తులు

కమలాపురం: కమలాపురంలో పట్టణంలో వెలసిన శ్రీ హజరత్ అబ్దుల్ గఫార్ షా ఖాద్రి, హజరత్ దస్తగిర్ షా ఖాద్రి, హజరత్ మౌలానా మౌల్వీ ఖాదర్ మొహిద్దీన్ షా ఖాద్రి, హజరత్ జహీరుద్దీన్ షా ఖాద్రి ఖుద్దస సిర్రహుం వార్ల గంధోత్సవం వైభవంగా జరిగింది. దర్గా పీఠాధిపతి (ముతవల్లి) సజ్జాద్–ఏ–నషీన్ మహమ్మద్ ఫైజుల్ గఫార్ షా ఖాద్రి ఆధ్వర్యంలో గురువారం అర్ధరాత్రి గంధోత్సవం అశేష భక్త జన సందోహం నడుమ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పీఠాధిపతి నివాసం నుంచి గంధం సామగ్రిని బస్టాండు సమీపంలోని గంధం ఇంటికి తీసుకువచ్చారు. అక్కడి నుంచి ప్రత్యేకంగా అలంకరించిన చాందినిలో ఊరేగించారు. ఊరేగింపులో తమిళనాడు నుంచి ప్రత్యేకంగా తయారు చేసి తీసుకొచ్చిన బాణా సంచా పేల్చారు. కర్ణాటక రాష్ట్రం నుంచి వచ్చిన డప్పు వాయిద్యాల నడుమ యువత వివిధ రకాల నృత్యాలు చేస్తూ స్వామి పట్ల ఉన్న భక్తిని ప్రదర్శించారు. పీఠాధిపతి దర్గాలోని స్వామి వార్ల మజార్లపై పూల చాదర్ సమర్పించి గంధం ఎక్కించారు. అనంతరం భక్తులందరికి పంచి పెట్టారు. గంధోత్సవం ఊరేగింపులో ఫకీర్లు చేసిన విన్యాసాలు అలరించాయి.ఉరుసు సందర్భంగా దర్గా మైదానంలో ఏర్పాటు చేసిన ఖవ్వాలీ పోటీ అలరించింది. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఉస్తాద్ సలీం ఝున్‌కార్, సర్ఫరాజ్ చిష్టిల మధ్య ఖవ్వాలీ పోటీ సాగింది. గఫార్ షా ఖాద్రి, జహీరుద్దీన్ షా ఖాద్రి స్వాముల వారి పై పాడిన ఖవ్వాలి పాటలను వినేందుకు భక్తులు ఆసక్తి కనబరిచారు. రాష్ట్రం నలు మూలల నుంచే కాక తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, కేరళ రాష్ట్రాల నుంచి భక్తులు వేలాదిగా ఉరుసు మహోత్సవాలకు తరలివచ్చారు. స్వామి వార్లను దర్శించుకొని ప్రత్యేక పాతెహ నిర్వహించారు.



గంధోత్సవంలో పాల్గొన్న పీఠాధిపతి, సోదరులు



విద్యుద్దీపాల అలంకరణలో కమలాపురం పెద్ద దర్గా

జనం తరలె.. రథం కదిలె



ఒంటిమిట్ట కోదండ రామయ్య రథోత్సవంలో పాల్గొన్న భక్తులు (ఇన్‌సెట్) ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

- మార్మోగిన రామ నామస్మరణ
- ఏకశిలానగరి..భక్తజనఝరి

ఒంటిమిట్ట: అశేష భక్తుల రామ నామస్మరణ, మంగళవాయిద్యాలు, చెక్కభజనల మధ్య ఒంటిమిట్ట కోదండ రామయ్య రథోత్సవం రమణీయంగా సాగింది.గురువారం రంగురంగు పూలతో అలంకరించిన రథంలో సీతారాములు ఆశీనులై భక్తులను అనుగ్రహించారు. రథాన్ని లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. ఏకశిలానగరి..భక్తజన సంద్రంగా మారింది. రథోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఒంటిమిట్ట సీఐ పురుషోత్తమరాజు, ఎస్ఐ మధుసూదన్‌రావుల ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం 8 గంటలకు స్వామివారు కాళీయమర్ధన అలంకారంలో భక్తులను అనుగ్రహిస్తాడు. రాత్రి 7 గంటలకు అశ్వవాహనసేవ జరుగుతుంది.



రథోత్సవాన్ని సెల్‌లో చిత్రీకరిస్తున్న భక్తురాలు

పరిమళించిన పద్మాలు

ఉమ్మడి జిల్లా ఖ్యాతిని పెంచిన ముగ్గురు



ఖాదర్‌వలీ

కడప సెవెన్‌రోడ్స్ : ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో మరో పద్మం వికసించింది. జిల్లా కీర్తి కిరీటంలో ఇంకో కలికి తురాయి వచ్చి చేరింది. సిరిధాన్యాల రాయబారిగా, మిల్లెట్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా ఖ్యాతి గడించిన ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ దూదేకుల ఖాదర్‌వలీ సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ బిరుదుతో సత్కరించి గౌరవించింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ద్వారా బుధవారం కర్ణాటక రాష్ట్రం తరుపున పద్మ పురస్కారాలు అందుకున్న ఖాదర్‌వలీ ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన వారు కావడం జిల్లాకు గర్వకారణం.

- ఖాదర్‌వలీ విద్యాభ్యాసం మైసూరు, బెంగళూరులో సాగింది. తర్వాత ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లారు. అక్కడ ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించి చాలా కాలం పనిచేశారు. తినే తిండి, తాగే నీరు, పీల్చే గాలి కలుషితమై సమాజం అనారోగ్యంగా మారుతుండడం ఆయనను కదిలించింది. అంతే...అమెరికన్ డాలర్లను కాదనుకుని మైసూరు వచ్చేశారు. చాలాకాలంగా మనం వదిలేసిన రాగి, కొర్ర, ఆరికె, సామలు, ఊదర్ల వంటి చిరు ధాన్యాల్లోని సంప్రదాయ ఆరోగ్య రహస్యాల గురించి ప్రజల్లో అవగాహన కల్పించడం ప్రారంభించారు. గత 20 సంవత్సరాలుగా సిరిధాన్యాల వినియోగం, ఉపయోగాల గురించి ప్రజల్లో విస్తృత చైతన్య కార్యక్రమాలు ఆయన నిర్వహిస్తున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఆయన పేరు తెలియని వారు దాదాపు ఉండరనడం ఏమాత్రం అతిశయోక్తి కాదు. ఐక్యరాజ్య సమితి 2023ను అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిన సందర్భంలోనే ఆయనకు పద్మ అవార్డు లభించడం విశేషం. జిల్లా వాసికి పద్మ పురస్కారం లభించడం ఇదే ప్రథమం కాదు.

సాహితీ పద్మం 'పుట్టపర్తి'వారు



పుట్టపర్తి నారాయణాచార్యులు

వైఎస్సార్ జిల్లా సాహితీ వనంలో వికసించిన పద్మం సరస్వతీపుత్ర డాక్టర్ పుట్టపర్తి నారాయణాచార్యులు. 1914 మార్చి 28న అనంతపురం జిల్లా చియ్యేడు గ్రామంలో జన్మించినప్పటికీ చిన్న వయస్సులోనే కడపజిల్లాకు వచ్చేశారు. ప్రొద్దుటూరులో ఉపాధ్యాయుడిగా కొంతకాలంగా పనిచేశారు. ఆయన ప్రఖ్యాత గ్రంథమైన 'శివ తాండవం'రచించింది అక్కడి శివాలయంలోనే. అక్కడి నాలుగు రోడ్ల కూడలి వద్ద స్థానికులు ఆయన శిలా విగ్రహం ఏర్పాటు చేసి తమ గౌరవాన్ని ప్రదర్శించారు. తర్వాత ఆయన కడప రామకృష్ణ హైస్కూలులో పనిచేస్తూ ఇక్కడే రిటైర్ అయ్యారు. కడప మోచంపేటలో స్థిరనివాసం ఏర్పరుచుకున్నారు. ఆయన 14 భాషలను నేర్చుకున్నారు. ఆయన ప్రతిభా పాటవాలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు ప్రదానం చేసింది.

'యామిని'కి పద్మభూషణం



యామిని కృష్ణమూర్తి

సుప్రసిద్ధ కూచిపూడి, భరత నాట్య కళాకారిణి యామిని కృష్ణమూర్తి అన్నమయ్య జిల్లా సంబేపల్లెకు చెందిన వారు. ఆమె ఇల్లు, సమీప బంధువులు నేటికీ ఇక్కడే ఉన్నారు. 1940 డిసెంబరు 20న ఆమె జన్మించారు. పూర్వీకుల గ్రామం సంబేపల్లె అయినప్పటికీ బాల్యం నుంచే ఆమె మదనపల్లెలో పెరిగారు. అప్పుడప్పుడు సంబేపల్లెకు వచ్చి వెళుతుండేవారని స్థానికులు పేర్కొంటుంటారు. మదనపల్లె, మద్రాసులో ఆమె విద్యాభ్యాసం సాగింది. తిరుమల–తిరుపతి దేవస్థానం అస్థాన నర్తకిగా ఆమె పనిచేశారు. ఢిల్లీలో స్థిరపడ్డారు. ఆమె సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం 1968లో పద్మశ్రీ, 2001లో పద్మభూషణ్, 2016లో పద్మవిభూషణ్ వంటి పురస్కారాలు అందజేసి గౌరవించింది. ఇలా వీరు జిల్లా ఖ్యాతిని జాతీయ స్థాయిలో ఇనుమడింపజేశారు. డాక్టర్ దూదేకుల ఖాదర్‌వలీకి కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారాన్ని అందించడం పట్ల ఇంటాక్ జిల్లా మాజీ కన్వీనర్ సిద్దవటం సీతారామయ్య, రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు, దూదేకుల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మున్నూరు అక్బర్ వేర్వేరు ప్రకటనల్లో హర్షం వ్యక్తం చేశారు.



క్లుప్తంగా

జొన్ననాము తిని 12 గొర్రెలు మృతి

పెద్దముడియం : పెద్దపసుపుల గ్రామ పొలాల్లో జొన్ననాము తిని 12 గొర్రెలు మృతి చెందాయి. మైలవరం మండలం కంబాలదిన్నె గ్రామానికి చెందిన రాచకుంట మునెయ్య అనే కాపరి తన గొర్రెలను మండలంలోని ఉలవపల్లె గ్రామ పొలాల్లో మేపుకొంటూ ఉండేవాడు. గురువారం ఉదయం తన గొర్రెలను స్వగ్రామానికి తోలుకుపోతుండగా మార్గంమధ్యలోని పెద్దపసుపుల గ్రామ పొలాల్లో జొన్ననాము తినటంతో అక్కడికక్కడే మృతి చెందాయి. వాటి విలువ విలువ రూ.1.50 లక్షల విలువ ఉంటుందని మునెయ్య తెలిపారు.

పోలీసుల అదుపులో గంజాయి విక్రయదారుడు

కడప అర్బన్ : కడప తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలోని భగత్ సింగ్ నగర్‌లో నివాసం వుంటున్న చిలకల చాంద్‌బాషా అనే వ్యక్తి గురువారం గంజాయిని విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకున్నారని సమాచారం. అతని వద్ద నుంచి సుమారు రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. ఇతనిపై గతంలో 9 కేసులు వున్నాయి. పోలీసులు విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

క్రీస్తు ప్రాణ త్యాగం పాపుల కోసమే!

- నేడు గుడ్‌ఫ్రైడే
- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

కడప కల్చరల్ /రాజంపేట టౌన్: క్రీస్తు అనగానే క్షమ, కరుణ గుణాలు గుర్తుకు వస్తాయి. లోకంలోని పాపులను పరిశుద్ధులను చేసేందుకు, వారికి క్షమను అందించేందుకు కరుణామయుడైన ఏసు క్రీస్తు శిలువపై తన ప్రాణాలను బలిపెట్టిన రోజే గుడ్‌ఫ్రై డే. దీన్నే శుభశుక్రవారం అని కూడా అంటారు. తన ఆత్మబలిదానంతో పాపులకు దేవుని పరిశుద్ధ సన్నిధిలో స్థానం కల్పించిన ఈ శుక్రవారాన్ని ప్రపంచంలోని క్రై స్తవులందరూ శుభ శుక్రవారంగా భావిస్తారు. దయామయుడైన క్రీస్తు శిలువపై చిందించిన రక్తం మానవాళికి శుభాలను సమకూర్చింది గనుక దీనిని భక్తిశ్రద్ధలతో నిర్వహించుకుంటారు. ఈ శుక్రవారం నాడే కల్వరిగిరిపై క్రీస్తును శిలువపై శిక్షించారు.

జిల్లాలో గుడ్‌ఫ్రైడే వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించుకునేందుకు క్రైస్తవులు, విశ్వాసులు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. అందులో భాగంగా పాస్టర్లు చర్చిల్లో ఉపవాస ప్రార్థనలు నిర్వహించనున్నారు.

ముగిసిన లెంట్‌డేస్

గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకుని క్రైస్తవ లోకం 40 రోజులపాటు లెంట్‌డేస్ (శోక దినాలు) నిర్వహిస్తోంది. ఈ సమయంలో క్రైస్తవులు ఎలాంటి శుభ కార్యాలు నిర్వహించలేదు. నిరంతరం దైవ ధ్యానంలోనే గడిపారు. పొరపాటున కూడా చెడు పనులకు పాల్పడకుండా జాగ్రత్త పడతారు. కనీసం నూతన దుస్తులు కూడా ధరించరు. చర్చిలలో ఉదయం, సాయంత్రం ప్రత్యేకంగా మౌనంగా ప్రార్థనలు నిర్వహించారు. మట్టల ఆదివారం నాటితో లెంట్‌డేస్ ముగిశాయి. శుభ శుక్రవారాన్ని, ఆ తర్వాత పునరుత్థానం సందర్భంగా ఆదివారం పండుగను నిర్వహించుకునేందుకు క్రైస్తవులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.



శిలువపై బలియాగమైన ఏసుప్రభువు

పునరుత్థానమే ఈస్టర్

కల్వరి కొండమీద శిలువపై మరణించిన క్రీస్తును అక్కడి కొండ గుహలో సమాధి చేశారు. మూడవ రోజు ఆదివారం ఆయన పునరుత్థానం పొంది తిరిగి తన శిష్యులకు దర్శనమిచ్చాడు. 'నేను జీవమును' అన్న మాటకు నిదర్శనంగా నిలిచి లోకానికి తన దివ్య మహిమను చాటాడు. ఆయన పునరుత్థానం చెందిన ఆదివారాన్నే ఈస్టర్ సండేగా వ్యవహరిస్తారు. అశాంతితో తల్లడిల్లుతున్న నేటి ప్రపంచానికి క్రీస్తు ప్రబోధించిన ప్రేమ, దయ, కరుణ, క్షమ గుణాలు ఆదర్శం కావాలని ఆశిద్దాం! ఈ సందర్భంగా జిల్లాలోని అన్ని చర్చిలలో క్రీస్తు ఆత్మబలిదానం, శిలువ యాగం తదితర ఘట్టాలను ప్రదర్శిస్తారు. చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. కల్వరిగిరిపై బలిదానం చేసిన ఘట్టాలను గురువులు వివరిస్తారు.

మహోన్నతమైన రోజు



మానవుల పాప నివారణ కోసం ఏసుక్రీస్తు శిలువపై మరణించిన రోజే గుడ్‌ఫ్రైడే. ఇది మానవులందరికీ ఓ మహోన్నతమైన రోజు. ఏసుక్రీస్తునందు విశ్వాసం ఉంచిన వారు పాపముల నుంచి విముక్తి పొంది నిత్యజీవము పొందెదరు.

- కరుణాకర్, పాస్టర్, లూథరన్ చర్చి, రాజంపేట

ఉత్తమ సేవలతోనే ఎస్‌బీఐకి గుర్తింపు

కడప కార్పొరేషన్ : ఖాతాదారులకు ఉత్తమ సేవలందించడం వల్లే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ)కు గుర్తింపు లభించిందని ఆ బ్యాంకు అమరావతి నెట్‌వర్క్–3 జనరల్ మేనేజర్ గుండూరావు అన్నారు. గురువారం కడప నగరంలోని ఏడురోడ్ల కూడలిలో ఉన్న ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచి శతాబ్ది వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నతరహా పరిశ్రమలకు, గృహ నిర్మాణాలు, వాహనాలకు రుణాలందిస్తూ నమ్మకానికి ప్రతీకగా నిలిచామన్నారు. అనంతరం పలువురు సీనియర్ ఖాతాదారులు మాట్లాడుతూ ఎస్‌బీఐ ఖాతాదారులకు అత్యంత సరళంగా సేవలందిస్తోందని పేర్కొన్నారు. అనంతరం సీనియర్ ఖాతాదారులను జీఎం, డీజీఎం, ఏజీఎంలు సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ మేనేజర్ లేఖా మేనన్, కడప ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచి ఏజీఎం ఆర్ అనిల్ కుమార్, చీఫ్ మేనేజర్ తిరుమల్, మేనేజర్ పవన్, ఎస్‌బీఐ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి సునీల్, ఎస్‌బీఐ ఎంప్లాయీస్ యూనియన్ జనరల్ సెక్రటరీ చంద్రశేఖరే, అధ్యక్షులు కిరణ్ కుమార్‌రెడ్డి, పలువురు బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.



ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచి సిబ్బందితో జీఎం, అమరావతి నెట్‌వర్క్–3 కె.గుండూరావు

సమస్యలపై మాట్లాడితే అసత్య కథనాలా?

బ్రహ్మంగారిమఠం : పేదల సమస్యలపై తాము అధికారులతో మాట్లాడితే.. ఆ రెండు పత్రికలు అసత్య కథనాలు ప్రచురించాయని బి.మఠం జెడ్పీటీసీ ఎం.రామగోవిందరెడ్డి తెలిపారు. గురువారం ఎంపీపీ వీరనారాయణరెడ్డితో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. డీటీ, ఇన్‌చార్జి తహసీల్దార్ కిశోర్‌కుమార్‌రెడ్డిని తాము కలిసి మాట్లాడామని, కానీ ఆయనపై దాడి చేశారని ఆ పత్రికలు వక్రీకరించాయని పేర్కొన్నారు. త్వరలో జరగనున్న అసైన్‌మెంట్ కమిటీ సమావేశంలో ప్రతి నిరుపేదకు భూమి ఇస్తామని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి తెలిపారని, ఇదే విషయమై బుధవారం తహసీల్దార్ కార్యాలయానికి తాను, సింగిల్ విండో అధ్యక్షుడు సుబ్బారెడ్డి, చౌదరివారిపల్లె సర్పంచ్ చిన్న ఓబుల రెడ్డి, మరికొంత మంది పార్టీ నాయకులు కలిసి వెళ్లి చర్చించామన్నారు. తహసీల్దార్‌తో మాట్లాడుతున్న దాన్ని కొందరు వీడియోలు తీసి సోషల్ మీడియాలో ఉంచారని, దాన్ని ఆధారంగా చేసుకొని అసత్య కథనాలు రాశారని పేర్కొన్నారు. జెడ్పీటీసీ రామగోవిందరెడ్డి తనపై ఎలాంటి దాడి చేయలేదని తహసీల్దార్ వివరణ ఇచ్చినా, ఎల్లో మీడియా అదంతా పక్కన పెట్టి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని దెబ్బతీసేందుకు ఇలాంటి తప్పుడు రాతలు రాసిందని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రజల సమస్యల కోసం ఎల్లో మీడియా పని చేయాలని సూచించారు. సమావేశంలో సింగిల్ విండో అధ్యక్షుడు సుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మేకల రత్నకుమార్ యాదవ్, సర్పంచ్ చిన్న ఓబులరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీటీసీ రామగోవిందరెడ్డి

APS RTC

టెండరు ప్రకటన

YSR ... 10-04-2023 ... 25-04-2023 ... 26-04-2023 ... https://apsrtc.ap.gov.in లో tenders ... APSRTC ...

No. E2727/02/2023-DPTO(K), ... 03-04-2023 ... YSR కడప

VPR COLLEGE OF EDUCATION

REDDY COLONY, KAMALAPURAM, KADAPA-516289.

Ed.CET Code- VPRC

Admission Notification for B.Ed " A" & " B" Category seats applications are invited from eligible candidates for Management Quota (Cat-B) and Cat-A left over seats (Spot Admissions) for the academic year 2022-23.

Category "A" Seats - 66 & EWS -10	Total Vacancies -101
Category " B" Seats - 25	

Apply along with certificates copies should submit in the college on any working day by online college website/post/mail on or before 08-04-2023 for selection of candidates. Selection will be may be as per the APSCHE Guidelines.

PRINCIPAL , 9866454143 & 9866999258



జవాబుపత్రాల పంపిణీ కేసులో ఆరుగురు అరెస్టు

బ్రహ్మంగారిమఠం : ఈనెల 3న 10వ తరగతి జవాబు పత్రాలు పంపిణీ కేసులో ఆరుగురిని అరెస్టు చేసినట్టు మైదుకూరు డీఎస్పీ వంశీధర్ గౌడ్ తెలిపారు. వైఎస్సార్ జిల్లా బి.మఠం పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఆయన కథనం మేరకు.. సగిలేరు గురుకుల పాఠశాల విద్యార్థులు బి.కోడూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పరీక్షలు రాస్తున్నారు. ఈ నెల 2న గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు జిల్లా పరిషత్ పాఠశాలకు వెళ్లి విద్యార్థులకు కేటాయించిన నంబర్లను పరిశీలించి ఒక కిటికీ దగ్గర కూర్చున్న విద్యార్థితో మాట్లాడుకున్నారు. ఈ నెల 3న తెలుగు ప్రశ్న పత్రం ఇచ్చిన 15 నిమిషాలకే ఆ విద్యార్థి ఒక పేపర్‌లో ప్రశ్నలు రాసి కిటికీ నుంచి విసిరి వేయగా, సగిలేరు గురుకుల పాఠశాలలో కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తున్న తెలుగు ఉపాధ్యాయుడు చంద్ర బాలుడు అది తీసుకుని దానికి జవాబులు రాసి ఆ విద్యార్థికి చేరవేశాడు. అంతటితో ఆగకుండా బి.మఠంలోని దీప్తి హైస్కూల్ ఫిజిక్స్ టీచర్ సుబ్రహ్మణ్యం, తెలుగు టీచర్ రామాంజనేయులు, హిందీ టీచర్ బాలరాజులకు వాట్సాప్ ద్వారా జవాబు పత్రాన్ని పంపించాడు. వారు బి.మఠం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పరీక్షలు రాస్తున్న తమ పాఠశాల విద్యార్థులకు పత్రాలను చేరవేశారు. అలాగే దీప్తి హైస్కూల్‌లోనే మైక్రో జిరాక్స్ చేసి కొంత మంది విద్యార్థుల తల్లిదండ్రులకు అందించారు. వారు రసూల్ జిరాక్స్ సెంటర్‌కు వెళ్లి జిరాక్స్ తీస్తుండగా ఓ విలేకరి వీడియో తీసి వాట్సాప్‌లో పెట్టాడు. దీంతో ఈ విషయం సంచలనంగా మారిందని, ఎస్పీ అన్బురాజన్ ఆదేశాలమేరకు పూర్తిగా విచారించామని డీఎస్పీ వంశీధర్‌గౌడ్ తెలిపారు. ఈ కేసులో మేకల గంగాధర్, గంగిరెడ్డి చిన్నరామిరెడ్డి, చిట్టిబోయిన బాలసుబ్రహ్మణ్యం, వనిపెంట రామాంజనేయులు, సగిలి బాలరాజు, కందిబోయిన చంద్రబాలుడులను అరెస్టు చేశామన్నారు. ఈ ఆరుమంది నిందితుల్లో ఇద్దరు విద్యార్థుల తల్లిదండ్రులు, నలుగురు ఉపాధ్యాయులు ఉన్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మైదుకూరు రూరల్ సీఐ నరేంద్రరెడ్డి, బి.మఠం ఎస్‌ఐ విద్యాసాగర్, ఏఎస్‌ఐ మూర్తి పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప రీజియన్ వ్యాప్తంగా ఉన్న ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పీవీ శివారెడ్డి, రీజినల్ అధ్యక్ష, కార్యదర్శులు నాగముని, సుధాకర్ కోరారు. గురువారం కడప ఆర్టీసీ బస్టాండు నుంచి చైర్మన్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డికి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మైదుకూరు, కడప, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు డిపోలలో డిపో మేనేజర్లు, సూపర్‌వైజర్లు, ఉద్యోగులను వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. సంస్థ నియమ నిబంధనలు పాటించడం లేదన్నారు. అనంతరం ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని, అందరూ సమన్వయంతో పని చేసి సంస్థను అభివృద్ధి బాటలో పయనింపజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సగినాల శ్రీనివాసులు, దాస్, రహమతుల్లా, జయరాం, భాష, జబ్బార్, రాయుడు, టీఎం బాష, ఫయాజ్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసీ చైర్మన్‌కు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న ఎన్‌ఎంయూఏ నాయకులు

ఘనంగా శ్రీమారుతి హాస్పిటల్స్ ప్రారంభం

తిరుపతి కల్చరల్ : ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని మినర్వా గ్రాండ్ హోటల్ పక్కన అత్యాధునిక సౌకర్యాలతో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీమారుతి 100 పడకల హాస్పిటల్స్‌ను గురువారం ఘనంగా ప్రారంభించారు. సినీ హీరోలు డాక్టర్ మోహన్ బాబు, మంచు విష్ణు, మంచు మనోజ్, పలువురు రాజకీయ ప్రముఖులు హాజరై జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ మోహన్ బాబు మాట్లాడుతూ 9 ఏళ్లుగా అతి తక్కువ ఖర్చుతో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న శ్రీమారుతి హాస్పిటల్స్ మరో అడుగు ముందుకు వేసి సరికొత్త టెక్నాలజీతో నూతనంగా శ్రీమారుతి హాస్పిటల్స్ ను ప్రారంభించడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి మాట్లాడుతూ తిరుపతి, రాయలసీమ ప్రజలకు గుండెకు సంబంధించిన అత్యాధునిక కేథలాబ్‌ను అందుబాటులోకి తీసుకురావడమేకాక.. నాణ్యమైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో అన్ని విభాగాలను ఒక్క చోట ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. హాస్పిటల్ ఎండీ డాక్టర్ మారుతీకృష్ణ మాట్లాడుతూ ఊపిరితిత్తులలో ఉన్న చీము గడ్డలు, నెమ్ము గడ్డలను తొలగించి ఊపిరితిత్తులకు స్టంట్ కూడా వేసే అత్యాధునిక పరికరాలు హాస్పిటల్లో ఉన్నాయన్నారు. ప్రత్యేకంగా ఇంటర్వెన్షనల్ పల్మనాలజీలో బ్రాంకోస్కోపి ద్వారా ఆధునిక ఊపిరితిత్తుల చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ డాక్టర్ శిరీష, డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీహరి, బర్డ్ హాస్పిటల్ మాజీ డైరెక్టర్ డాక్టర్ జగదీష్, ఐఎంఏ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ దగ్గుపాటి శ్రీహరిరావు, హాస్పిటల్ డైరెక్టర్ ఎం.రామక్రిష్ణమనాయుడు, కడప జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి, మేనేజర్ దామోదరం, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.



శ్రీమారుతి హాస్పిటల్స్‌ను ప్రారంభిస్తున్న సినీ నటుడు మోహన్‌బాబు

దేశ భవిష్యత్తులో యువత పాత్ర కీలకం

కడప ఎడ్యుకేషన్ : దేశ భవిష్యత్తులో యువత పాత్ర కీలకమని ఒరిస్సా రాష్ట్ర అనిమల్ హస్బండ్రీ, వెటర్నరీ సర్వీస్ డిపార్టుమెంట్ ఆఫ్ ఫిషరీస్ అండ్ అనిమల్ రిసోర్సు డెవలప్‌మెంట్ డైరెక్టర్(ఐఏఎస్ అధికారి) డాక్టర్ వై.విజయ్ అన్నారు. యోగివేమన విశ్వ విద్యాలయం డిపార్టుమెంట్ ఆఫ్ ఎర్త్‌సైన్సు అడజన్ట్ ఫ్యాకల్టీ హోదాలో ఒడిస్సా రాష్ట్ర ప్రభుత్వ సంచాలకులు డాక్టర్ వై.విజయ్ ఎర్త్ సైన్సు విభాగాన్ని సందర్శించి విద్యార్థులకు ప్రేరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో 16 నుంచి 30 ఏళ్లలోపు యువత అధిక శాతం మంది ఉన్నారని, వీరంతా నైపుణ్యం గల వారిగా తయారవుతే శక్తివంతమైన దేశంగా మారుతుందన్నారు. ఎర్త్ సైన్సు విభాగాధిపతి శివప్రతాప్, ఐక్యూఏసీ సంచాలకులు సంచాలకులు సుబ్రమణ్యశర్మ మాట్లాడుతూ విశ్వవిద్యాలయం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉజ్వల భవిష్యత్తు నిర్మించుకోవాలన్నారు. అనంతరం విజయ్‌ను విద్యాలయ కులసచివులు వెంకట సుబ్బయ్య మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు.



మాట్లాడుతున్న ఐఏఎస్ అధికారి విజయ్

అనుమానాస్పద స్థితిలో బాలుడి మృతి

దువ్వూరు : మండల పరిధిలోని చిన్నపల్లె గ్రామానికి చెందిన నరేష్ (10) అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఎస్‌ఐ రాఘవేంద్రారెడ్డి గురువారం తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు చిన్నపల్లె గ్రామానికి వెళ్లి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



మృతి చెందిన నరేష్

పది పరీక్షలకు బైక్‌పై వెళ్తుండగా ప్రమాదం

ముద్దనూరు : మండలంలోని ఆరవేటిపల్లె గ్రామానికి చెందిన ఇద్దరు విద్యార్థులు పదవ తరగతి పరీక్షలకు మోటార్‌బైక్‌పై వెళ్తుండగా ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో వారు గాయపడ్డారు. గురువారం ఆరవేటిపల్లెకు చెందిన చంద్రశేఖర్, సుదర్శన్ అనే ముద్దనూరు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్షలకు బైక్‌పై ఇంటి నుంచి బయలుదేరారు. మార్గంమధ్యలో మరో మోటార్ బైక్ ఢీకొంది. ఈ ఘటనలో ఇద్దరు విద్యార్థులు గాయపడ్డారు. వారు స్థానిక ఓ ప్రైవేటు వైద్యశాలలో ప్రాథమిక చికిత్స అనంతరం పరీక్షకు హాజరయ్యారు. చేతికి తీవ్ర గాయమైన విద్యార్థి పరీక్ష రాయడానికి సహాయకున్ని నియమించినట్లు పరీక్ష నిర్వాహకులు తెలిపారు.



గాయపడిన విద్యార్థులు

వాత్సల్య పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కేంద్ర ప్రభుత్వం మహిళాభివృద్ధి, శిశుసంక్షేమశాఖ ద్వారా నిర్వహిస్తున్న మిషన్ వాత్సల్య పథకాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ పీడీ ఎంఎన్ రాణి కోరారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ 18 ఏళ్ల లోపు రక్షణ, సంరక్షణ అవసరమైన కుటుంబాలకు చెందిన పిల్లలు దరఖాస్తుకు అర్హులన్నారు. దరఖాస్తు చేసుకున్న వారు అర్హులైతే వారికి మిషన్ వాత్సల్య స్పాన్సర్‌షిప్ కింద ఒక్కొక్కరికి రూ.4 వేల చొప్పున సాయం అందుతుందన్నారు. తల్లి వితంతువు, కుటుంబం విడిచి పెట్టిన పిల్లలు, అనాథపిల్లలు, ప్రాణాంతక వ్యాధికి గురైన వారి పిల్లలు, శారీరకంగా అసమర్థులు, ఆర్థిక పరిస్థితి పూర్తిగా సరిగా లేని వారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. అర్హులైన వారు సమీప వార్డు, గ్రామ సచివాలయం పోలీసును సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరింత సమాచారం కోసం తమ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.



ఐసీడీఎస్ ఈడీ ఎంఎన్ రాణి

గుర్తుతెలియని మృతదేహం

రాజంపేట : రాజంపేట రైల్వేస్టేషన్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని రేణిగుంట జీఆర్‌పీ ఎస్‌ఐ అనిల్ గురువారం తెలిపారు. మృతదేహాన్ని రాజంపేట ఏరియా హాస్పిటల్‌లోని మార్చురీ రూంలో ఉంచామని ఆయన పేర్కొన్నారు. మృతదేహం వివరాల కోసం ఆరా తీస్తున్నామన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

'శ్రీనాథ్‌రెడ్డిది విలక్షణ వ్యక్తిత్వం'

గాంధీనగర్(విజయవాడ సెంట్రల్) : సీ రాఘవాచారి ఏపీ ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ దేవిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డిది విలక్షణమైన వ్యక్తిత్వమని ప్రభుత్వ సలహాదారు(ప్రజావ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. గురువారం ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ దేవిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి సంస్మరణ సభ జరిగింది. తొలుత సజ్జల రామకృష్ణారెడ్డి, దేవులపల్లి అమర్, ఏపీయూడబ్ల్యూజే ప్రతినిధులు శ్రీనాథ్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంస్మరణ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ శ్రీనాథ్‌రెడ్డి భూస్వామ్య కుటుంబం నుంచి వచ్చారని, ఆయన జర్నలిజంలోకి అనుకోకుండా వచ్చి ఉండొచ్చని తాను భావిస్తున్నానన్నారు. ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా విశేష సేవలందించారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్ మాట్లాడుతూ శ్రీనాథ్‌రెడ్డి పేరు మీద యోగి వేమన యూనివర్సిటీ జర్నలిజం విద్యార్థులకు గోల్డ్ మెడల్ అందించేందుకు కృషి చేయాలన్నారు. అంతకు ముందు ఐజేయూ ఉపాధ్యక్షులు అంబటి ఆంజనేయులు, ఏపీయూడబ్ల్యూజే అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు మాట్లాడుతూ దేవిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి రాయలసీమ ప్రాంత సమస్యలపై నిరంతరం పోరాడారన్నారు. అనంతరం సజ్జల రామకృష్ణారెడ్డి ఫొటో జర్నలిస్టు అసోసియేషన్ రూపొందించిన క్యాలెండర్ ఆవిష్కరించారు. సంస్మరణ సభలో ఏపీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి చందు జనార్ధన్, కె జయరాజు, చావా రవి, కొండా రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బావిలో గల్లంతైన యువకుడి మృతి

లక్కిరెడ్డిపల్లి : బావి నీటిలో బుధవారం గల్లంతైన యువకుడి మృతదేహాన్ని గురువారం బయటకు తీశారు. మండల పరిధి కాకులవరం సమీపంలోని ఓ బావిలో ఈత కొట్టేందుకు రాయచోటి మంగళ కాలనీకి చెందిన ఐదుగురు యువకులు బుధవారం వచ్చారు. వీరు మద్యం సేవించి బావిలో ఈత కొడుతుండగా తిరుపతి దేవేంద్ర (17) అనే యువకుడు గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న లక్కిరెడ్డిపల్లి ఎస్‌ఐ వినోద్ కుమార్ తమ సిబ్బందితోపాటు లక్కిరెడ్డిపల్లి అగ్నిమాపక సిబ్బంది రాత్రంతా బావిలో గాలించారు. మృతి చెందిన యువకున్ని గురువారం ఉదయం బయటకు తీశారు. మృతదేహాన్ని లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వినోద్ కుమార్ తెలిపారు.

ఎట్టకేలకు బయటపడ్డ మృతదేహం

నిమ్మనపల్లె : ఈతకు వెళ్లి నీటి కుంటలో మృతి చెందిన సుధాకర్ (35) మృతదేహం ఎట్టకేలకు గురువారం మధ్యాహ్నం బయటపడింది. పెద్దమాదిగపల్లెకు చెందిన టి.సుధాకర్ మంగళవారం దామరఒడ్డు నీటికుంటలో ఈదుతూ ప్రమాదవశాత్తు మునిగిపోయాడు. అప్పటి నుంచి అగ్నిమాపక సిబ్బంది, పోలీస్, రెవెన్యూ అధికారులతో కలిసి మృతదేహం కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అయినా రెండు రోజులపాటు మృతదేహం జాడ తెలియలేదు. దీంతో గురువారం అదనపు బలగాలను రప్పించి మృతదేహాన్ని వెతికారు. నీటి కుంట నుంచి నీటిని ఐదు అడుగుల మేర బయటకు తోడారు. అనంతరం మధ్యాహ్నానికి మృతదేహం ఆచూకీ లభించింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

ఉచిత శిక్షణతో ఉపాధి

■DDUGKY పథకం ద్వారా జిల్లాలోని గ్రామీణ నిరుద్యోగ యువతకు ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ కోర్సులో 4 నెలలు, కంప్యూటర్ హార్డ్‌వేర్ కోర్సులో 3 నెలలు, ఉచిత శిక్షణ వసతితో కూడిన ఉపాధి కల్పించబడును. Nihar skill Education. సెల్: 9966448807, 7013665112. [C-784757]

PARAMEDICAL

■B.Sc Nursing,BPT& Paramedical Courses Available. DMLT, Anesthesia, Dialysis, Cardiology, Cathlab, Opthalmic. Any Inter Eligible, Tirupati, 7416478396, 7416478395. [T-479]

REAL ESTATE

LAND FOR SALE

■తడ తిరుపతి రోడ్‌లో శ్రీ కాళహస్తి దగ్గర రోడ్ పక్కన 20.4 ఎకరాలు అమ్మబడును. ఎకరా: 35 లక్షలు. వివరాలకు సంప్ర : 98400 37133. [NA-21921]

SERVICE

రెడ్డీస్ వివాహవేదిక "బంధం"

■ Bandham - Reddy మ్యాట్రిమొని, మీరు కోరుకున్న వధూవరుల సంబంధాల్ని మీ ముంగిటకు తెచ్చే ఏకైక వివాహ వేదిక ''బంధం''. సెల్ : 80992 45999. [A-734370]

CHANGE OF NAME

■ I, ANKI REDDY NAGESWAR REDDY (Old Name) S/o Late NAGI REDDY Resident at H.No: 3-66, T.Soudarivaripalli Village, Brahamamgari Mattam Kadapa Dist. Andhra Pradesh, have changed my name and shall hereafter be Known as ANKI REDDY PALLI NAGESWARA REDDY (New name). [A-660]

HEALTH CARE

స్పెషాలిటీ క్లినిక్

■వెరికోస్ వెయిన్స్ (కాళ్ళలో నరాల వాపు) బాధితుల కొరకు కడపలో మన కిషోర్ హాస్పిటల్, రాజారెడ్డి వీధి నందు Varicose veins Speciality Clinic, ఈ శని, ఆది వారాలు (8,9 తేదిన) డా॥ ప్రదీప్‌కుమార్ రెడ్డి గారిచే చికిత్స. Ph: 8019715221, 8919801780. [C-784756]

WANTED

■బిస్కెట్, చాక్లెట్ ఏజెన్సీ నందు పనిచేయుటకు అనుభవం కల్గిన సేల్స్ మెన్ మరియు డ్రైవర్ కావలెను. సంప్రదించండి : 8247200115, 9959737074. [C-784862]

■WANTED Receptionist with Computer Knowledge, Salary : 15000 @ MADAN Digitals, KADAPA. Cont: 9985114466. [C-784863]

■రాజంపేట A.R డయాగ్నొస్టిక్ లో పనిచేయుటకు డాక్టర్స్, ల్యాబ్ టెక్నీషియన్స్ మరియు ఎక్స్‌రే టెక్నీషియన్స్ కావలెను. రెజ్యూమ్‌ను వాట్సాప్ లేదా మెయిల్ పంపవలెను. 9030108489. Mail ID:ardiagnosticsrajampet423@gmail.com. [C-784754]

■ VL మాన్యుఫాక్చరర్స్ నందు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, ఆటో డ్రైవర్స్ కావలెను. 12000/- to 19000/- 6309241148, 6302892553 [G-6645]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీవసతి + భోజనం. జీతం: 16k - 18k ఏజెంట్ కమీషన్ 6K. ఫోన్: 9640258899 [HA-1164]

■ VIP's ఇంట్లో పేషెంట్‌ని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు అర్జెంటుగా కావలెను. ఆయా, వార్డ్ బాయ్స్, నర్సులు, వంటవారు, RMP, Dr., Q: 5th - డిగ్రీ. 10-30 వేల జీతం, భో+రూం ఫ్రీ, Hyd. Ph: 7995984445 [H-16]

■ ఉద్యోగాలు: S.R. నూతనంగా ప్రారంభిస్తున్న బ్రాంచ్‌లలో Job చేయుటకు యువతీ, యువకులకు అవకాశం Q: 10, ఇంటర్, డిగ్రీ (P/F) Age: 18 to 28 నో ఫీజ్, Cell: 9177342337 [WA-6939]

■మ్యాన్ పవర్ & సెక్యూరిటీ ఫీల్డ్‌లో అనుభవమున్న ఫీల్డ్ ఆఫీసర్స్ కావలెను. Contact : Mega Group Man Power & Security. Cell : 70326 10569, 70931 25169. [NA-5483]

■ అతి తక్కువ పెట్టుబడితో కంపెనీ నుండి పంపించే పాత రికార్డ్స్ చూసి కొత్తరికార్డ్స్ వ్రాసినందుకు వారంవారం అధిక ఆదాయం పొందండి. వివరాలకు ఫోన్ చేయండి. 77308 99503 [G-539]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. జీతం: 15000+ ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-785702]

■ JOBS : మీ గ్రామం / మీ మండలం లోనే ఉంటూ MY V3 Ads కంపెనీలో పార్ట్‌టైమ్ వర్క్ / జాబ్ చేసుకునే అవకాశం. వెంటనే సంప్రదించండి. సెల్: 90306 61651. [A-734369]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించండి
9705944423
9705907418
9010223797
9010072409

సాక్షి ఉద్యోగ అవకాశాలు
ప్రతి మంగళ, శుక్రవారములలో

WANTED
తిరుపతిలోని ప్రముఖ జూనియర్ కాలేజీ నందు పనిచేయుటకు అన్ని సబ్జెక్టులకు Sr.Lecturer's, Jr.Lecturer's మరియు PRO's కావలెను
90008 52892